
సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 14 | మార్చి | 2023






కళలు, కళాకారులు, కవులు, రచయితలకు పుట్టినిల్లు ఓరుగల్లు. అలాంటి నేపథ్యమున్న ప్రాంతంనుంచి విశ్వవేదిక వరకు ఎదిగిన చంద్రబోస్ ఉమ్మడి జిల్లా కలికితురాయిగా నిలిచారు. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు నాటు పాటకు ఉత్తమ ఒరిజినల్ పాటల విభాగంలో పాట రచయిత, ఉమ్మడి జిల్లాకు చెందిన చంద్రబోస్ ఆస్కార్ అవార్డు గెలుచుకోవడంపై పలువురు కవులు, కళాకారులు, రచయితలు, సినీగేయ రచయితలు హర్షం వ్యక్తం చేశారు. వారు కవిత ద్వారా, గీతికల ద్వారా చంద్రబోస్‌ను అభినందించారు. శారద నాట్యమండలి సభ్యులు జేఎస్ శర్మ, జూలూరు నాగరాజు, జేబీ కల్చరల్ సొసైటీ నిర్వాహకులు జదల శివ తదితరులు చంద్రబోస్‌కు అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లా కవులు, కళాకారులు, సినీ దర్శకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

- హన్మకొండ కల్చరల్/సాక్షి నెట్‌వర్క్

ప్రపంచ వేదికపై ఓరుఘల్లు

ఆస్కార్ అవార్డు అందుకున్న మన చంద్రబోస్



ఆయన రాసిన నాటు..నాటు పాటకు అంతర్జాతీయ గుర్తింపు రావడంపై హర్షం

- యావత్ గేయ, సినీ రచయితలకు దక్కిన గౌరవం
- ఉమ్మడి జిల్లా సినీ గేయరచయితల మనోగతం
- స్వగ్రామం చల్లగరిగలో అంబరాన్నంటిన సంబరాలు

బంగారు గురిగిని తీసుకొచ్చే స్థాయికి..



తెలుగు పాటకు ఆస్కార్ రావడం మన జాతికి లభించిన గౌరవం. చంద్రబోస్ అన్నను స్ఫూర్తిగా తీసుకొని సినిమా రంగంలోకి వచ్చా. తెలుగు వర్ణమాల ఈనాడు మీ మెడలో విజయ వర్ణమాలగా మారింది. చల్లగరిగ నుంచి బంగారు గురిగిని(భారతదేశానికి మొదటిసారిగా గోల్డెన్ గ్లోబ్ అవార్డు లభించడం), ఇప్పుడు ఆస్కార్ అవార్డు తీసుకొచ్చే స్థాయికి ఎదిగిన చంద్రబోస్‌కు అభినందనలు.

- కాసర్ల శ్యామ్, ప్రముఖ జానపద, సినీ గేయ రచయిత

తెలుగు వారంతా గర్వపడే విషయం



భారతదేశ చరిత్రలో నాకు తెలిసి గేయ రచయితకు ఆస్కార్ రావడం ఇదే ప్రథమం. అప్పట్లో 'రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే' పాటకు జాతీయ పురస్కారాన్ని అందించేందుకు భారత ప్రభుత్వం వేటూరి సుందరరామ మూర్తిని ఆహ్వానించింది. 'నా తెలుగు భాషను ప్రాచీన భాషగా గుర్తిస్తేనే ఈ అవార్డు తీసుకుంటా' అని ఆయన పురస్కారాన్ని తిరస్కరించారు. అలాంటిది ఈ దేశం గుర్తించని భాషలో(తెలంగాణ మాండలికంలో) పాట రాసిన చంద్రబోస్ ఇప్పుడు ప్రపంచం నోట తెలుగు పాటను పాడిస్తున్నారు. ఈ అవార్డు రావడం తెలుగు వారంతా గర్వించదగ్గ విషయం.

- మిట్టపల్లి సురేందర్, సినీ గేయ రచయిత

తెలంగాణ తల్లికి వజ్రకిరీటం



చంద్రబోస్‌కు ఆస్కార్ అవార్డు రావడం తెలుగు జాతికి వచ్చినంత గర్వకారణం. తెలంగాణ తల్లికి వజ్రకిరీటం.. పల్లె పల్లె పచ్చికలో పూలు పూసిన సంతోషం.. తెలంగాణ పల్లెలోని పచ్చిక పూల తీవాచీ పరుస్తుంది.. పుట్ల కొద్దీ వృక్షజాతి నవధాన్యాల సిరిసంపదలు .. ఇవన్నీ విరివిగా పండి పల్లె ఆసాముల ఇండ్లలో రాశులుగా పోసిన సంతోషం. జాతి గర్వపడే విషయం. తేట జలపాతపు ఊటలు వెనుకటి లాగా ఉప్పొంగి అలుగులు వారిన సంతోషం. జానపద కళలన్నీ కూడా ఈ సందర్భంగా ఆయనకు స్వాగత విజయభేరి మోగిస్తున్నాయి.

- వరంగల్ శ్రీనివాస్, సినీ సంగీత దర్శకుడు

సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు...



సినీ కళా సామ్రాజ్యంలో చిరకాల కలగా మిగిలిపోయిన ఆస్కార్ సాకారమైన ఆ సమయం. భారతీయ చలనచిత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగింది. తెలంగాణ తెలుగు పాటల రచయిత చంద్రబోస్ కలం నుంచి జాలువారిన ఆణిముత్యం నాటు నాటు పాట. తెలంగాణ భాష, యాసకు విశ్వవేదికపై స్థానం కల్పించి విజయజెండా ఎగరేసి వీనుల విందుగా విహరింపజేసిన చంద్రబోస్ ఎందరికో ఆదర్శప్రాయుడు.

గొట్టె రమేశ్ , పాటల రచయిత

చంద్రబోస్‌తో రెండు పాటలు రాశా..



తెలుగు సినిమాని ఖండాంతరాలు దాటించి ఒక తెలుగువాడి సత్తా చాటి భారతదేశ గొప్పదనాన్ని, తెలుగు అనే భాష తెలియని ఇతర దేశాలకు తెలుగు వెలుగులు నింపిన గీత రచయిత చంద్రబోస్ నా ప్రాంతంవాడని చెప్పుకోవడానికి చాలా గర్వంగా ఉంది. చంద్రబోస్‌తో కలిసి అనువంశికత సినిమాలో రెండు పాటలు రాశాను. చాలా ఆనందంగా ఉంది.

- రామకృష్ణ కందకట్ల, గీత రచయిత, సంగీత దర్శకుడు, వరంగల్

గర్వంగా ఉంది..



ప్రాంతీయ సినిమా విశ్వవేదికపై నిలబడడం చాలా గొప్ప విషయం. పల్లె పలుకులతో ప్రాణం పోసుకున్న పాట ప్రపంచాన్ని మెప్పించింది. ఇప్పుడు ఏ నోట చూసినా నాటు నాటు పాటే. తెలుగు సినిమా ఎందులోనూ తీసిపోదు అని మరోసారి నిరూపితమైంది. చంద్రబోస్, కీరవాణి, ఇతర టీమ్‌కు అభినందనలు.

- ఉదయ్ గుర్రాల, సినీ డైరెక్టర్

మా ప్రాంతవాసి కావడం సంతోషకరం



ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడం హర్షణీయం. పాటను రాసిన ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ మా ప్రాంతవాసి కావడం సంతోషంగా ఉంది. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకొచ్చిన చంద్రబోస్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు.

- గండ్ర వెంకటరమణారెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే

హాలీవుడ్‌కు పునాది



'నాటు నాటు' పాటలో మట్టి వాసన ఉంది. పల్లె ప్రతీకలతో సాహిత్యాన్ని చంద్రబోస్ గొప్పగా రాశారు. చంద్రబోస్ వరంగల్ వాసి కావడం మనందరికీ గర్వకారణం. ఆస్కార్ అవార్డు రావడంతో హాలీవుడ్‌కు పునాది వేసినట్లయ్యింది. ఇకపై ప్రపంచమంతా మన సినిమాలు చూడనుంది. ఆస్కార్ అవార్డు రావడం ఎంతో సంతోషకరమైన విషయం.

- డాక్టర్ ప్రభాకర్ జైనీ, సినీ దర్శకుడు

చల్లగరిగలో సంబురాలు

చిట్యాల: చంద్రబోస్ రచించిన ట్రిపుల్ ఆర్ సినిమాలోని 'నాటు..నాటు' పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్ అవార్డు దక్కించుకున్న సందర్భంగా చిట్యాల మండల కేంద్రంలో గ్రామీణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.ఆయన స్వగ్రామం చల్లగరిగలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో దావు వీరారెడ్డి, అప్పాల వెంకటరమణ, మేరుగు సమ్మయ్య, జాలీగపు రవీందర్, బండి సత్యం, కళాకారులు చింతల రమేశ్, దాసారపు నరేశ్, మ్యాదరి సునీల్, రాజు నాయక్, జన్నె యుగేందర్, రజినీకాంత్, పుల్ల ప్రతాప్, రత్నాకర్ పాల్గొన్నారు.



చల్లగరిగలో స్వీట్లు పంచుకుంటున్న గ్రామస్తులు



ట్రిపుల్ ఆర్‌గా తాళ్లపద్మావతి స్కూల్ విద్యార్థుల ప్రదర్శన

న్యూస్‌రీల్

జాతర ఆదాయం రూ.12,57,338

హసన్‌పర్తి: శ్రీ ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి జాతర ఆదాయం రూ.12,57,338 వచ్చింది. సోమవారం జాతర హుండీని లెక్కించారు. వివిధ రూపంలో వచ్చిన ఆదాయ వివరాలను చైర్మన్ చింతల లక్ష్మణ్, ఈఓ కిషన్‌రావులు సోమవారం వెల్లడించారు. గతేడాది కంటే రూ.93,119 అధిక ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో ధర్మకర్తలు సృజన, మడ్డి శ్రీనివాస్, భరత్, కాల్వ శ్రీనివాస్, బూర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'స్ప్రింగ్‌స్ప్రీ-23' ప్రారంభానికి పవన్ కళ్యాణ్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న వసంతోత్సవం స్ప్రింగ్‌స్ప్రీ-23 వేడుకల ప్రారంభోత్సవానికి జనసేన అధినేత, పవర్ స్టార్ పవన్‌కళ్యాణ్ ముఖ్య అతిథిగా రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నెల మూడవ తేదీన స్ప్రింగ్‌స్ప్రీ-23 థీంను కళాధ్వనిగా ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. స్ప్రింగ్‌స్ప్రీ-23వేడుకలను కలర్‌ఫుల్‌గా నిర్వహించడంలో భాగంగా సెలబ్రేటీలకు ఆహ్వానం పలికే క్రమంలో రెండు రోజుల క్రితం పవన్‌కళ్యాణ్‌కు ఆహ్వానం అందించగా, నిట్‌కు తప్పకుండా వస్తానని సుముఖతను వ్యక్తం చేసినట్లు సమాచారం. బుధ, గురువారాల్లో పవన్ కళ్యాణ్ వ్యక్తిగత సిబ్బంది నిట్ వరంగల్‌కు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించనున్నారు. స్ప్రింగ్‌స్ప్రీ-23 ముగింపు కార్యక్రమానికి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నట్లు సమాచారం.

నేటినుంచి పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సుల ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారంనుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు. మొత్తంగా 2,183మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. సైన్స్, ఎంఎల్‌ఐ ఎస్‌సీ కోర్సుల వారికి 18నుంచి మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. వీటిలో 2,894మంది పరీక్షలు రాయనున్నారు. ఆయా పరీక్షలకు 33 సెంటర్లను ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఐటీ నోటీసులపై హైకోర్టు స్టే

కేయూకు తాత్కాలిక ఊరట

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి ఐటీశాఖ ఇచ్చిన డిమాండ్ నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చింది. దీంతో యూనివర్సిటీ అధికారులకు కాస్త ఊరట కలిగింది. ఈ నెల 10న స్టే ఉత్తర్వులు రాగా, సోమవారం కేయూ అధికారులు వెల్లడించారు. 2016-2017, 2017-2018, 2018-2019 ఆర్థిక సంవత్సరాలకు కాకతీయ యూనివర్సిటీకి సంబంధించిన ఆదాయ, వ్యయాలకు ఐటీ రిటర్న్‌ను అధికారులు దాఖలు చేయకపోవడంతో ఐటీ శాఖ పలుమార్లు నోటీసులు ఇచ్చింది. అయినా యూనివర్సిటీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో రూ.200 కోట్ల డిమాండ్ నోటీస్‌తో పన్ను చెల్లించాలని ఐటీ అధికారులు గత నెలలో నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో పన్ను చెల్లింపు కోసం సమయం కావాలని గత ఫిబ్రవరి 22న ఐటీశాఖకు లేఖ రాయగా, దానిని సవరించి 12.5శాతం అనగా రూ.25 కోట్లు పన్నును మార్చి 7వ తేదీ వరకు చెల్లించాలని మరో నోటీసు ఇచ్చింది. ఈ డిమాండ్ నోటీసులపై స్టే కోరుతూ ఈ నెల 3న కాకతీయ యూనివర్సిటీ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఐటీ డిమాండ్ నోటీసులపై స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 15 వరకు ఐటీశాఖను అఫిడవిట్ (కౌంటర్)దాఖలు చేసుకోవచ్చునని పేర్కొంది. దీంతో ఐటీశాఖ నుంచి యూనివర్సిటీకి తాత్కాలిక ఊరట లభించినట్లయింది.


జేఎల్‌ఎం పోస్టులు భర్తీ చేయాలి

చేపల పెంపకంతోనే ఉపాధి

కొలువుదీరిన కాళేశ్వరం పాలక మండలి - 10లో▸

ఆ భూములపై నివేదిక ఇవ్వండి..

- అదనపు కలెక్టర్ సంధ్యారాణికి కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశం
- 'ఆత్మల సంతకాలు.. సమాధులే సాక్ష్యాలు' కథనంపై ఆరా
- వివరణ ఇవ్వాలని తహసీల్దార్‌కు మెమో : అదనపు కలెక్టర్



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలో, నగరం చుట్టుపక్కల జరుగుతున్న భూ దందా ఏమిటీ.. ? 'సాక్షి'లో ప్రచురితమైన 'ఆత్మల సంతకాలు సమాధులే సాక్ష్యాలు' కథనం చూస్తుంటే వ్యవహారం పెద్దదిగా ఉంది. ఈ భూములపై సమగ్ర నివేదిక కావాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్.. అదనపు కలెక్టర్ సంధ్యారాణిని ఆదేశించారు. కాజీపేట తహసీల్దార్ పరిధిలో జరిగిన భూ కుంభకోణంపై సాక్షిలో 'ఆత్మల సంతకాలు సమాధులే సాక్ష్యాలు' శీర్షికన సోమవారం ప్రచురితమైన ఇన్వెస్టిగేషన్ కథనం జిల్లాలో సంచలనం రేపింది. కొందరు రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు నివ్వెరపరిచింది.పదిహేను ఏళ్ల క్రితం చనిపోయిన వారి పేర్లతో కాజీపేట తహసీల్దార్ అఫిడవిట్లు తీసుకుని విలువైన భూమికి పేర్లు మార్చడం తీరు చూసి ఉన్నతాధికారులు నిర్ఘాంతపోయారు. 'సాక్షి'లో సవివరంగా ప్రచురితమైన కథనంపై పలువురు ప్రశంసలు కురిపించారు. కొందరు బాధితులు తమ గోడు వెల్లబోసుకున్నారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పందించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణికి ఆదేశాలు ఇచ్చారు. ఈ విషయంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణిని వివరణ కోరగా 'సాక్షి'లో ప్రచురితమైన కథనంలో వచ్చిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని తహసీల్దార్‌కు మెమో జారీ చేస్తున్నామన్నారు. అందుబాటులో ఉన్న సమాచారం పరిశీలించామని, తహసీల్దార్ ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. బాధితులకు ఇబ్బందులు ఉంటే నేరుగా ఉన్నతాధికారులను కలిసి సమస్య వివరించాలని సూచించారు.

తహసీల్దార్లు.. వివరాలు ఇవ్వండి..

రెవెన్యూ శాఖలో కొందరు అధికారుల అక్రమాలపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఆరు నెలల కాలంలో 10గుంటలకు తక్కువగా ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించి జరిగిన క్రయవిక్రయాలు, నాలా, మ్యుటేషన్ తదితర సమగ్ర వివరాలు అందజేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తహసీల్దార్లను ఆదేశించినట్లు సమాచారం. ఆ వివరాల ఆధారంగా తదుపరి చర్యలు ఉండనున్నట్లు సమాచారం.

ఉత్సవాల జోష్!

- ఆత్మీయ సమ్మేళనాలు, ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు
- ఆరు జిల్లాలకు ఇన్‌చార్జ్‌ల నియామకం
- ఇతర జిల్లాలకు సీనియర్లు

సాక్షిప్రతినిధి, వరంగల్: మరోసారి తమ వాణి, బాణిని వినిపించేందుకు భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) సమాయత్తమవుతోంది. జిల్లాల్లో విస్తృతంగా చేపట్టే కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు జిల్లా ఇన్‌చార్జ్‌లు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులను ఏకం చేసేలా ఆత్మీయ సమ్మేళనాలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు, పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించనున్నారు. నియోజకవర్గ ప్రతినిధుల సభ, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం కార్యక్రమాలను రానున్న మూడు నాలుగు నెలలపాటు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టేందుకు కార్యాచరణ అమలు చేయనున్నారు.

రంగంలోకి జిల్లా ఇన్‌చార్జ్‌లు

జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యేలతో ఆయా కార్యక్రమాల అమలును జిల్లా ఇన్‌చార్జ్‌లు సమన్వయం చేస్తారు. ఈ మేరకు పార్టీ నియమించిన నాయకులు తమకు బాధ్యతలు అప్పగించిన జిల్లాల మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో వెంటనే సమావేశమై పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళిక, అమలుపై చర్చిస్తారు. ఈ క్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల ఇన్‌చార్జ్‌గా ప్రభుత్వ విప్ ఎంఎస్.ప్రభాకర్‌ను నియమించారు. మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డిని జేఎస్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు, ఎమ్మెల్సీ కోటిరెడ్డిని జనగామ, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌ను మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమించారు. నియామకపు ఉత్తర్వులు జారీ చేసిన బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. వెంటనే అమలు చేయాలని సూచించారు.

ఇతర జిల్లాలకు మన ఎమ్మెల్సీలు

ఉమ్మడి వరంగల్ బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు, ఎమ్మెల్సీలను ఇతర జిల్లాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావును నియమించారు. మేడ్చల్ ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నల్లగొండకు కడియం శ్రీహరి, వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. అలాగే నిజామాబాద్ ఇన్‌చార్జ్‌గా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, సూర్యాపేటకు టీఎస్‌ఆర్‌డీసీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, సిద్దిపేటకు మాజీ ఎమ్మెల్సీ బోడకుంట్ల వెంకటేశ్వర్లును నియమించారు.

కేఎంసీలో ఎన్‌ఎంసీ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్‌ఎంసీ సభ్యులు

ఎంజీఎం : నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎంసీ) సభ్యులు సోమవారం కాకతీయ మెడికల్ కళాశాల, ఎంజీఎం ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రిలోని క్యాజువాలిటీని సందర్శించి అందున్న సేవలు, ఎంతమంది రోగులు వస్తున్నారనే విషయాన్ని పరిపాలనాధికారులను అడిగి తెలుసుకున్నారు. సూపర్ స్పెషాలిటీ విభాగంలో ఐదు డీఎం సీట్లు ప్రారంభించడం కోసం ఈ తనిఖీలు నిర్వహించినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రిలో సీట్లు పెంచే విభాగాలైనా సైకియాట్రీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ విభాగాలను పరిశీలించారు. గైనకాలజీలో ఐదు సీట్లు, సైక్రియాట్రీలో నాలుగు, కంటి చికిత్స విభాగంలో ఒక్క సీటు, ఈఎన్‌టీలో ఒక్క సీటు పెంచనున్నారు.

వరంగల్ జిల్లా కలెక్టర్‌గా ప్రావీణ్య

- గ్రేటర్ పాలనపై కనిపించని మార్కు
- బల్దియా కమిషనర్ ఎవరో..!



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రావీణ్య

వరంగల్ అర్బన్: వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పి.ప్రావీణ్య నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆమె బాధ్యతలు స్వీకరించారు. గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా పనిచేస్తున్న 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రావీణ్యకు పదోన్నతి కల్పిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఇదే బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్ బి.గోపిని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కరీంనగర్ స్పెషల్ ఆఫీసర్‌గా, డీఆర్వోగా పనిచేసిన ప్రావీణ్య తదుపరి గ్రేటర్ హైదరాబాద్ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా కొనసాగారు. 2021 సెప్టెంబర్ 3న గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రావీణ్య పరిపాలనలో పెద్దగా జోక్యం చేసుకోలేదనే విమర్శలను ఎదుర్కొన్నారు. నగరంలోని 66 డివిజన్లలో చేపట్టిన అన్ని రకాల అభివృద్ధి పనుల వివరాలను ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. కానీ.. రాజకీయ ఒత్తిళ్లతో కాస్త వెనక్కి తగ్గారనే విమర్శలున్నాయి. తప్పులు చేసిన అధికారులు, ఉద్యోగులపై కనీసం విచారణ, చర్యలు చేపట్టలేకపోయారనే విమర్శలను ఎదుర్కొన్నారు. కాగా.. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రావీణ్యకు అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనాథ్, ఆర్డీఓ మహేందర్ జీ పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

గ్రేటర్ వరంగల్ కమిషనర్ ఎవరో!

మహా నగర పాలక సంస్థ కమిషనర్ ప్రావీణ్య పదోన్నతిపై కలెక్టర్‌గా వెళ్లడంతో కమిషనర్ పోస్టు ఖాళీ అయింది. ఇంకా ఎవరినీ నియమించకపోగా.. ఇన్‌చార్జ్ కూడా ఎవరికీ ఇవ్వలేదు. దీంతో త్వరలోనే నూతన కమిషనర్ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రావీణ్య బదిలీ కావడంతో కమిషనర్ పోస్టుతోపాటు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) వైస్ చైర్మన్ పోస్టు ఖాళీ అయింది. దీంతో గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా ఎవరు వస్తారు? ఎప్పుడు నియమిస్తారు? ఐఏఎస్? నాన్ ఐఏఎస్ వస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రేటర్ గ్రీవెన్స్‌సెల్‌కు 83 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న బల్దియా వింగ్ అధికారులు

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌కు 83 ఫిర్యాదులు అందాయి. ఇంజనీరింగ్ విభాగానికి 24, టౌన్ ప్లానింగ్‌కు 40, పన్నుల విభాగానికి 9, ప్రజారోగ్యం, శానిటేషన్‌కు 3, తాగునీటి కోసం 7 వినతులు సమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ రషీద్, జోనా, శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఈలు కృష్ణరావు, ప్రవీణ్ చంద్ర, సీహెచ్‌ఓ శ్రీనివాస్ రావు, సిటీ ప్లానర్ వెంకన్న పాల్గొన్నారు.

సగానికిపైగా మధ్యలోనే..

బల్దియా గ్రీవెన్స్ సెల్‌లో ఎలాంటి మార్పులు కనిపించలేదు. కమిషనర్ ప్రావీణ్య పదోన్నతిపై వరంగల్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్నారనే సమాచారం వైరల్‌గామారింది. దీంతో అధికారులు సగానికి పైగా మధ్యలోనే వెళ్లిపోయారు.

ప్రజావాణిలో వినతిపత్రాల స్వీకరణ

కాజీపేట: హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుంచి వినతిపత్రాలు స్వీకరించారు. 103 దరఖాస్తులు అధికారులు స్వీకరించి ఆయా శాఖల అధికారులకు పంపించారు. వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

వరంగల్‌లో..

వరంగల్ రూరల్: వరంగల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ సీహెచ్.మహేందర్ జీ ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల అధికంగా వస్తున్న గుండెపోటు కేసులను నియంత్రించడానికి సీపీఆర్ విధానంపై ఈనెల 15 నుంచి పోలీస్, మున్సిపల్, వైద్య శాఖ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకెళ్లాలి

- రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్

హన్మకొండ: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని నవలా రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. వంశీరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉద్యోగాలకు సంసిద్ధులవుతున్న అభ్యర్థులకు రెండు రోజులపాటు ఏర్పాటుచేసిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన కార్యక్రమంలో వీరేంద్రనాథ్ పాల్గొని మాట్లాడుతూ టార్గెట్‌లుండాలని కాని కోరికలుండ రాదన్నారు. కోరికలకు కృషి కలిస్తే వచ్చేది గమ్యమని అంటే లక్ష్యాన్ని సాధించినట్లన్నారు. అమెరికాలోని కీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు జ్యోతిరెడ్డి మాట్లాడుతూ జీవితంలో విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యోగా గురువు జగన్ గురూజీ మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను, గురువులను మరువకూడదన్నారు. సినీ నటుడు ప్రదీప్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి అధిగమించడం ఎలా అనే అంశంపై ప్రసంగించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వర్‌రావు, ఆకేళ్ల రాఘవేంద్ర, సంద్ర సుధీర్, సీఎస్‌బీ ఐఏఎస్ వ్యవస్థాపకురాలు బాల లత ప్రసంగించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కంచరకుంట మురళీధర్ రెడ్డి, డాక్టర్ గోగుల శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

17న జరిగే సీపీఎం సభకు తరలిరండి



కాశిబుగ్గ: ఈ నెల 17న వరంగల్ ఆజంజాహి మిల్లు గ్రౌండ్‌లో జరిగే సీపీఎం భారీ బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఏసిరెడ్డినగర్‌లోని రఘునాథభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా, సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మార్చి 17 నుంచి 29 వరకు తెలంగాణ రాష్ట్రంలో జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. దానిలో భాగంగా మార్చి 17న ప్రారంభ సభ వరంగల్ ఆజంజాహి మిల్లు గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సభకు సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారామ ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి రంగయ్య, నాయకులు ముక్కెర రామస్వామి, భూక్య సమ్మయ్య, నలిగంటి రత్నమాల, సింగారం బాబు తదితరులు పాల్గొన్నారు.

మహోత్సవాలు చారిత్రాత్మకం



వివిధ జిల్లాల నుంచి ఉత్సవాలకు హాజరైన ఫాదర్లు



ఫాతిమా మాత స్వరూపానికి పూలమాల వేస్తున్న మంత్రి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కాజీపేటలో ముగిసిన మాత ఉత్సవాలు
- పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు అరూరి రమేష్, రాజయ్య
- వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తజనం

కాజీపేట రూరల్ : ప్రపంచ ప్రత్యేకతను చాటుకున్న పోరుగల్లు ఓరుగల్లు నగరంలో చారిత్రాత్మకమైన ఫాతిమా మాత ప్రార్థన ఉత్సవాలు జరుపుకోవడం మనందరికి ఎంతో ఘనత అని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చి ప్రాంగణంలో సోమవారం ఫాతిమా ముగింపు ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఫాతిమామాత స్వరూపాన్ని దర్శించుకొని పూలమాల వేసి ప్రార్థనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కాజీపేట ఫాతిమానగర్ ప్రార్థన కేంద్రానికి నెలవని, ఫాతిమా మాత ప్రార్థనలు మనందరి జీవితాల అభివృద్ధికి ఎంతో అవసరమని జిల్లా ప్రజలకు, విశ్వాసులకు ఉత్సవాల గ్రీటింగ్‌ను ఆయన చెప్పారు. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, తాటికొండ రాజయ్య పాల్గొని ఫాతిమామాతను దర్శించుకొని ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వరంగల్ పీఠం నుంచి 12 జిల్లాల ప్రజలకు ఆధ్యాత్మికంగా విద్యా, వైద్యరంగాల్లో అనేక విధాలా సేవలందిస్తున్న ఓరుగల్లు పీఠకాపరి ఉడుముల బాల సేవలను కొనియాడారు. జిల్లా ప్రజలకు ఫాతిమా తల్లీ ఆశీర్వాదాలు ఉండాలని వారు వేడుకున్నారు. అదిలాబాద్ పీఠాధితి ప్రిన్స్ అంతోని, ఓరుగల్లు పీఠాధిపతి ఉడుముల బాల కృతాజ్ఞతబలి పూజ గావించి మాట్లాడుతూ ఫాతిమా మాత ఉత్సవాలకు తరలివచ్చిన భక్తజనం, జిల్లా ప్రజలకు ప్రజాప్రతినిధులకు, అధికారులు, అనధికారులు, విశ్వాసులకు తల్లీ ఆశీర్వాదాలు నిండుగా ఉండాలని సందేశమిచ్చారు. ఫాతిమామాత ఆశీస్సులతో వరంగల్ మెడికేర్ వైద్య కళాశాలకు ప్రభుత్వపరంగా అన్ని అనుమతులు సాధ్యమయ్యాయని బిషప్ ఉడుముల బాల అన్నారు. పూజా తుమ్మ యాగారెడ్డి వెండి గురువుచే దివ్యపూజ అనంతరం పతాక అవకోహణ గావించి మాత ఉత్సవాల ముగింపు ప్రకటించారు. ఆదివారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో హన్మకొండ జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఫాదర్లు మర్రెడ్డి, అనుకిరణ్, జోసెఫ్, కేథడ్రల్ చర్చి ప్రెసిడెంట్ బి.దయాసాగర్, రాజ్‌మోహన్ రావు, టిక్కు, డాక్టర్ అరూరి రమేష్, వివిధ జిల్లాల ఫాదర్లు, మఠకన్యలు, విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణకు సేవలు ఉపయోగిస్తాం

- ఎన్‌సీసీ 8వ బాలికల బెటాలియన్ కమాండెంట్ కల్నల్ రాజేష్ కౌశిక్



టీఎస్ఎస్పీ ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

మామునూరు: దేశ రక్షణలో ఎన్‌సీసీ సేవలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఇందుకోసం ఎన్‌సీసీ కేడెట్లకు ప్రత్యేకంగా ఫైరింగ్ శిక్షణ ఇస్తున్నామని ఎన్‌సీసీ 8వ బాలికల బెటాలియన్ కమాండెంట్ కల్నల్ రాజేష్ కౌశిక్ తెలిపారు. మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో ఎన్‌సీసీ 8వ బాలికల బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14, 15 తేదీల్లో జరగాల్సిన ఎన్‌సీసీ కేడెట్లకు ఫైరింగ్ శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా కల్నల్ రాజేష్ కౌశిక్ ప్రారంభించి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి 537 మంది (బాలికలు)ఎన్‌సీసీ కేడెట్లు హాజరై ఫైరింగ్ శిక్షణ పొందుతున్నారని చెప్పారు. విద్యార్థులు శిక్షణను క్రమశిక్షణతో నేర్చుకుంటే ఎన్‌సీసీ ఇచ్చే బీ, సీ, సర్టిఫికెట్లు భవిష్యత్‌లో ఉద్యోగం, పదోన్నతులు, ఉపాధి కోసం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన యువతీ, యువకులు సేవలు అత్యవసర సమయంలో దేశసేవకు ఉపయోగించుకుంటామని తెలిపారు. ఎక్కడైనా ప్రమాదాలు సంభవించినప్పుడు వారి సేవలు వినియోగించుకుంటామని వివరించారు. ఉదయం 6.45 నుంచి 9 గంటల వరకు ఎన్‌సీసీ కేడెట్లకు గన్‌ఫైరింగ్‌లో శిక్షణ, మెలకువలను నేర్పించారు. రైఫిల్ షూటింగ్, లెంత్ డిస్టెన్స్, గ్యాప్ ఫైరింగ్ తదితర అంశాలపై తగిన తర్ఫీదునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు సీఎం ధాప, జేసీఐ సుజితాదేవి, జేసీఐ శోభన, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై ఉపాధ్యాయుడి దాడి

హసన్‌పర్తి : ముగ్గురు మహిళలపై ఓ ఉపాధ్యాయుడితో పాటు మరో ఇద్దరు దాడికి పాల్పడ్డారు. గాయాలపాలైన మహిళలు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. హసన్‌పర్తికి చెందిన సారమ్మ, మంచిర్యాలకు చెందిన సమ్మక్క, ఎస్.సరోజలు ఆదివారం తల్లిగారి గ్రామమైన సీతంపేటలోని బంధువుల ఇంటిలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం అక్కడే ఉంటున్న సోదరి కుమారుడు బోగి సుధాకర్ ఇంటికి వెళ్లారు. తమ ఇంటికి ఎందుకు వచ్చారని సుధాకర్‌తో పాటు బోగి కుమారస్వామి, పోగుల సరస్వతి దాడి చేశారని బాధితులు తెలిపారు. ప్రస్తుతం సుధాకర్ ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల : గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని చెరువుముందు తండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, ఎల్లమ్మ ఆలయ నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం సర్పంచ్ సునీత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తండాలను జీపీలుగా గుర్తించి పాలించుకొనే అవకాశాన్ని కల్పించి, పది శాతం గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఇప్పటి వరకు చెరువుముందు తండాలో రూ.కోటి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరో కోటి రుపాయలను కూడా మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. రూ. 20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అందరూ కలిసి ఐక్యంగా ఉంటూ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, ఎంపీపీ జ్యోతి, బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, ఎంపీటీసీ యాదమ్మ, నాయకులు అభిమన్‌గాంధీ నాయక్, అమరేందర్‌రెడ్డి, ఆసిఫ్, వీరన్న, తుకారాం, యాకూబ్, మధుసూదన్, సోమాని, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బోనం సమర్పిస్తుండగా లేచిన తేనెటీగలు

- భయాందోళనకు గురైన స్థానికులు



తేనెటీగలు లేవడంతో పరుగులు పెడుతున్న స్థానికులు

జఫర్‌గఢ్ : ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య రేణుక ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పిస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు లేచిన సంఘటన మండలంలోని ఉప్పుగల్లులో సోమవారం చోటు చేసుకుంది. గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ చివర ఆలయాన్ని నిర్మించడంతో పాటు రేణుక ఎల్లమ్మ తల్లిని ప్రతిష్ఠించారు. గౌడ కులస్తులు అమ్మవారికి బోనం సమర్పించే కార్యక్రమాన్ని నిర్వహించడంతో వేడుకల్లో ఎమ్మెల్యే రాజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజయ్య నెత్తిన బోనం ఎత్తుకొని గుడిచుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి పూజలు నిర్వహిస్తుండగా అప్పటికే మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో వచ్చారు. గుడి పక్కన రావిచెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున లేవడంతో గమనించిన స్థానికులు అక్కడి నుంచి పరుగులు తీశారు. ఇదే సమయంలో ఆలయం లోపలి నుంచి వచ్చిన ఎమ్మెల్యే ఒక్కసారిగా అప్రమత్తమై తేనెటీగల బారిన పడకుండా వెంటనే కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపు ఆలయం వద్ద ఆందోళనకు గురైన స్థానికులు తేనెటీగలు పెద్దగా దాడి చేయకపోవడంతో అందరు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

నకిలీ డాక్టర్... ఆపై క్షుద్రపూజలు

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలను వెల్లడించిన సెంట్రల్‌జోన్ డీసీపీ బారీ



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్‌జోన్ డీసీపీ ఎంఏ బారీ

వరంగల్ క్రైం: మంత్రాలు, చేతబడుల పేరిట అమాయక ప్రజలను మానసికంగా వేధిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు మంత్రగాళ్లను వరంగల్ టాస్క్‌ఫోర్స్, హన్మకొండ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ తెలిపారు. సోమవారం హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నయీంనగర్‌కు చెందిన సయ్యద్ ఖదీర్ అహ్మద్, అతని అన్న కుమారుడు సయ్యద్ షబీర్ అహ్మద్‌లు ఇద్దరు కలిసి ఫారహీన పేరిట ఆస్పత్రిని ప్రారంభించి దాని ముసుగులో క్షుద్ర పూజలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. పోలీసులకు అందిన పక్కా సమాచారంతో నకిలీ డాక్టర్ ముసుగులో క్షుద్రపూజలకు పాల్పడుతున్న ఫారహీన ఆస్పత్రిపై దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించినట్లు పేర్కొన్నారు.

నమ్మించి మోసం...

నిందితులు స్థానికులతో పాటు ములుగు, కరీంనగర్, జమ్మికుంట, కొండపాక, అదిలాబాద్, ఇతర గ్రామాల నుంచి వచ్చే అమాయకులను క్షుద్రపూజలు చేసి చేతబడి తగ్గిస్తామని, సంతానం లేనివారికి సంతానం కలిగిస్తామని, ఆరోగ్యం, ఉద్యోగం ఇతర సమస్యలను పరిష్కరిస్తామని నమ్మబలికి మోసం చేసినట్లు తెలిపారు. సయ్యద్ ఖదీర్ అహ్మద్ గతంలో కరీంనగర్‌లో ఓ డాక్టర్ వద్ద సహాయకుడిగా పనిచేసి అక్కడే వైద్యం నేర్చుకున్నట్లు తెలిపారు. సయ్యద్ ఖదీర్ అహ్మద్ తండ్రి ఖరిముల్ల ఖాద్రీ గతంలో పూజలు చేసి తాయితలు కట్టేవాడన్నారు. దీంతో ఖదీర్ అహ్మద్ నిబంధనలకు విరుద్ధంగా కేయూ క్రాస్‌లో 35 ఏళ్లుగా ఫారహీన పేరిట క్లినిక్ నిర్వహిస్తున్నట్లు డీసీపీ బారీ తెలిపారు. తన వద్దకు వచ్చే రోగులను గిట్టనివారు చేతబడి చేశారని, దయ్యం పట్టిందని, నరదృష్టి ఉందని, దోషాలు ఉండటంతో సంతానం కలగటం లేదని లేనిపోని భయభ్రాంతులకు గురిచేసి క్షుద్ర పూజలు చేసి వాటిని తగ్గిస్తామని నమ్మబలికి ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యపరిస్థితి మెరుగుపడటానికి అల్లోపతి మందులు ఇచ్చి రోగం నయమైతే క్షుద్రపూజల వల్లే అని నమ్మిస్తున్నట్లు చెప్పారు. దీంతో పాటు హైదరాబాద్‌లో కొంత మంది ఇళ్లవద్దకు వెళ్లి క్షుద్రపూజలు నిర్వహించేవాడని డీసీపీ తెలిపారు. క్షుద్రపూజలకు సహకరించిన యాకుబ్‌బాబా, అ తని భార్య సుమరవీన్, ఎండీ ఇమ్రాన్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సయ్యద్ ఖదీర్ అహ్మద్‌పై గతంలో గుప్తనిధులు తవ్వకంపై ములుగు ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు డీసీపీ తెలిపారు. నిందితుల నుంచి పూజ సామాగ్రి, ఒక సెల్ ఫోన్, కారు, రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన టాస్క్ ఫోర్స్ ఏ సీపీ జితేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వ ర్లు, శ్రీని వాస్‌రావు, ఎస్సైలు నిస్సార్‌పాషా, లవన్‌కుమార్, ఏఏవో సల్మాన్‌పాషా, హెడ్ కానిస్టేబుల్ స్వ ర్ణలత, కానిస్టేబల్ భిక్షపతి, రాజేష్, రాజు, శ్రీని వాస్, శ్రవణ్‌కుమార్, నాగరాజు, నవీన్‌లను డీసీపీ అభినందించారు.

'కూలీలను చిత్రహింసలు పెడుతున్న పోలీసులు'

వెంకటాపురం(కె): ఛత్తీస్‌ఘడ్ ఆదివాసీ ప్రజలు తెలంగాణకు మిరపకోతలకు కూలీకి వెళ్లిన వారిని తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలు పెడుతున్నారని, దీన్ని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, పౌరహక్కుల సంఘాలు ఖండించాలని మావోయిస్టుపార్టీ జయశంకర్, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి వెంకటేష్ పేరున లేఖను సోషల్‌మీడియాలో విడుదల చేశారు. ఛత్తీస్‌ఘడ్ ఆదివాసీ ప్రజలు వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం, ఏటూరు నాగారం, మంగపేట మండలాలకు మిరప కోతల పనులకు కూలీకి వస్తున్నారన్నారు. వీరిని రైతులే స్వయంగా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోకి వచ్చి తీసుకెళ్లి వారి చెలకల వద్ద గుడిసెలు వేసి కూలీలతో పనులు చేయిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. కూలీల దగ్గరకు పోలీసులు వెళ్లి మావోయిస్టులకు సహకరిస్తున్నారని మిలీషియా సంఘాల్లో పని చేస్తున్నారని, విధ్వంసకర చర్యల్లో పాల్గొంటున్నారని అరెస్టు చేసి చిత్రహింసలు పెడుతున్నారన్నారు. మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారని లేఖలో పేర్కొన్నారు.

మోదీ దొంగల ముఠా నాయకుడు

- బీజేపీ పాపాలు కడిగే కాశీ, రామేశ్వరంలాంటిదా?
- మహిళల జోలికి వస్తే కర్రుకాల్చి వాత పెడతాం
- రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, పక్కన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

సాక్షి, మహబూబాబాద్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ దొంగల ముఠా నాయకుడని, అతని మిత్రుడు అదానీకి అప్పనంగా దేశ సంపదను దోచి పెడుతూ.. అడ్డంగా దొరికాడని, ఆయన ఇతరులను దోషులు అనడం దెయ్యాలు వేదాలు వల్లించడమే అని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. బీజేపీ కాశీ, రామేశ్వరం లాంటిదా? అందులోకి వెళ్తే ఏం పాపం చేసినా.. మాఫీ అవుతుందా? అని ప్రశ్నించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్, ఆయన మంత్రివర్గం అలీబాబా అరడజన్ దొంగలు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. రాంచంద్ర పిళ్లైని చిత్రహింసలు పెట్టి ఆయనతో కేసులో ఎమ్మెల్సీ కవిత పాత్ర ఉందని చెప్పించిన నీచులు బీజేపీ నాయకులని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన న్యాయవాదులు ఈకేసులో అన్యాయం జరుగుతుందని చెప్పారన్నారు. మీ కస్టడీలో ఉన్నవారు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎలా కలుస్తారని ప్రశ్నించారు. నిధులు రాకుండా అడ్డుపడ్డా, బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టినా.. బెదిరేది లేదన్నారు. రెట్టింపు బలంతో ప్రజల ముందుకు వెళ్తామని చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలపై మహిళా లోకం మండిపడుతోందన్నారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే కర్రుకాల్చి వాత పెడతామని హెచ్చరించారు. ఈసమావేశంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

రైల్వే టీటీఐపై యువకుల దాడి

మహబూబాబాద్ రూరల్ : రైల్వే టీటీఐపై ఇద్దరు యువకులలు దాడిచేసి గాయపర్చిన సంఘటన నవజీవన్ ఎక్స్ ప్రెస్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఖమ్మం జీఆర్పీ ఎస్సై భాస్కర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ పట్టణానికి చెందిన రైల్వే టీటీఐ ఎల్.కిరణ్ కుమార్ తన విధి నిర్వహణలో భాగంగా బల్హార్ష నుంచి చెన్నై వెళ్లే నవజీవన్ ఎక్స్ ప్రెస్ లో వస్తున్నాడు. ఈ క్రమంలో మహబూబాబాద్‌కు చెందిన గొల్లపల్లి రవితేజ, వరంగల్‌కు చెందిన మోతిపట్ల సుమన్ ఇద్దరు వరంగల్ లో ఎస్–1 బోగీలో ఎక్కారు. వారివద్ద టికెట్ ఉన్నదా అని టీటీఐ అడిగారు. దీంతో ఆ ఇద్దరు యువకులు అతడితో గొడవకు దిగారు. గొడవ జరుగుతున్న సందర్భంలో వారు టీటీఐపై దాడి చేసి గాయపర్చడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయన ఖమ్మం సీటీఐ శ్రీరాంకు సమాచారం ఇచ్చి మహబూబాబాద్ జీఆర్పీ అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశారు. రవితేజ, సుమన్ పోలీసుల అదుపులో ఉన్నారు. జరిగిన సంఘటనపై ఎస్సీఆర్ఎంయూ వరంగల్ బ్రాంచి సెక్రటరీ ఆవుల యుగంధర్ మాట్లాడుతూ రైల్వే టీటీఐ ఎల్.కిరణ్కుమార్ తన విధి నిర్వహణలో భాగంగా యువకులను టికెట్లు ఉన్నాయా అని అడిగితే వారు ఆయనపై దాడి చేసి గాయపర్చడం విచారకరమన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి చోటు చేసుకోకుండా రైల్వే శాఖ ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన టీటీఐని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఆరోగ్య తెలంగాణ సీఎం కేసీఆర్ లక్ష్యం

- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ బాస్కర్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న వినయ్ భాస్కర్

హన్మకొండ: ఆరోగ్య తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా సీఎం కేసీఆర్ అన్ని చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉచిత మహిళ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కవిత జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ మహిళ నాయకులు కేక్ కట్ చేశారు. వినయ్ మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో స్త్రీలు అనేక రకాలుగా వ్యాధుల బారిన పడుతున్నారని, వారిని ఆదుకునేందుకు ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్‌మోహన్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాకేష్, తానా అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా గైనకాలాజిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మధుచందర్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- వీసీలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కాళోజీ సెంటర్: ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. సోమవారం ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఆర్జేసీ జయప్రదబాయితో కలిసి జిల్లా కలెక్టర్లు, ఇంటర్మీడియట్ అధికారుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్రతీ జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, రాష్ట్ర యంత్రాంగం ప్రత్యేకంగా టెలీమానస్ టోల్‌ఫ్రీ నం.14416ను ఏర్పాటు చేసిందని తెలిపారు. కలెక్టర్ గోపి మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 27 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, 14,005 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం కంట్రోల్ రూంలో నం.89770 81640 ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీవత్స, డీఐఈఓ కాక మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వారధి యాప్ ప్రారంభం

వరంగల్ రూరల్: ప్రజావాణిలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, బాధితులకు సత్వర న్యాయం చేయాలని కలెక్టర్ బి.గోపి అన్నారు. కలెక్టరేట్‌లో వారధి యాప్‌ను సోమవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తమ సమస్యను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లయితే సంబంధిత శాఖల అధికారులకు వెళ్తుందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆయుర్వేదిక్ శిబిరం ప్రారంభం

కలెక్టరేట్ ప్రాంగణంలో అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరాన్ని కలెక్టర్ గోపి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బీ.గోపి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉన్నది ఆయుర్వేదిక్ వైద్యం అని గుర్తు చేశారు. అనంతరం ఆయన ఆయుష్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ మహేందర్ జీ, ఆయుర్వేద వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో 300 మందికి పైగా పరీక్షలు నిర్వహించి.. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఔషధ మొక్కల ఉపయోగాలపై కలెక్టరేట్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.